గిఫ్ట్‌ప్యాక్‌ల కోసం అర్హులను ఎంపిక చేయాలి

నిడమనూరులో క్రైస్తవ మత పెద్దల సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాజ్ కుమార్

- **హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్**

నిడమనూరు, డిసెంబర్ 19 : క్రిస్మస్ సందర్భంగా ప్రభుత్వం క్రైస్తవులకు అందించనున్న గిఫ్ట్‌ప్యాక్‌ల కోసం అర్హులను ఎంపిక చేయాలని గృహనిర్మాణ శాఖ పీడీ, నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్ కోరారు. మంగళవారం స్థానిక తాసీల్దార్ కార్యాలయంలో క్రైస్తవ మత పెద్దలు, తాసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా నాగార్జునసాగర్ నియోజకవర్గానికి వెయ్యి గిఫ్ట్ ప్యాక్‌లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. క్రైస్తవ మతపెద్దలు అర్హులను గుర్తించి జాబితాను తాసీల్దార్లకు అందించాలని సూచించారు. సమావేశంలో తాసీల్దార్లు జంగాల కృష్ణయ్య, వజ్రాల జయశ్రీ, తౌఫిక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ'కు విశేష స్పందన

వైద్య పరీక్షల కోసం కట్టంగూర్ పీహెచ్‌సీకి వచ్చిన మహిళలు

కట్టంగూర్, డిసెంబర్ 19 : మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా గత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తున్నది. ప్రతి మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. అవసరమైన మహిళలకు పలు రకాల పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారు. కట్టంగూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రతి మంగళవారం సుమారు 200 మంది మహిళలు ఉచిత పరీక్షలు కోసం తరలివస్తున్నారు. మహిళలకు వైద్యులు, సిబ్బంది 8 రకాల పరీక్షలు చేసి మందులు అందించడంతో పాటు సలహాలు, సూచనలు ఇచ్చి భరోసా కల్పిస్తున్నారు. ఇంకా అవసరమైతే నల్లగొండకు సిఫార్సు చేస్తున్నారు. వేలాది రూపాయలు ఖర్చయ్యే వివిధ రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించడం, మందులు అందించడంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యువత ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

పెద్దవూర : బూత్ లెవల్ అధికారులకు శిక్షణ ఇస్తున్న డీటీ శ్రీదేవి

- **ఆర్డీఓ చెన్నయ్య**

మిర్యాలగూడ, డిసెంబర్ 19 : 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కును విధిగా నమోదు చేసుకోవాలని ఆర్డీఓ చెన్నయ్య సూచించారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో అఖిలపక్షం నాయకులు, నియోజకవర్గ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 6 నుంచి 22 వరకు ఓటరు నమోదు కోసం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు.

చందంపేట : బీఎల్‌ఓలు ప్రజలకు అందుబాటులో ఉంటూ నూతన ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని చందంపేట తాసీల్దార్ రాములు ఆదేశించారు. మంగళవారం తాసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఆర్ఐ నజీర్, అనిల్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు శిక్షణ

పెద్దవూర : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు వీలుగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని డిప్యూటీ తాసీల్దార్ శ్రీదేవి సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన బీఎల్‌ఓల శిక్షణలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఓటరు జాబితాలో తప్పులను సవరించుకునేందుకు అవకాశం ఉందన్నారు. చనిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు దండ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, ఎంపీఎస్‌ఓ సాలయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

త్రిపురారంలో..

త్రిపురారం : బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్స్ పాపిరెడ్డి, మధుసూదన్, శ్రీనివాస్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాసీల్దార్ గాజుల ప్రమీల, డీటీ గాదె సైదులు, ఆర్ఐలు గుండెబోయిన సైదులుయాదవ్, వంగూరు ఝాన్సీరాణి పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎదుగాలి

- **ఎమ్మెల్యే బీఎల్ఆర్**

రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల బ్యాడ్మింటన్ టోర్నమెంట్ జిల్లా జట్టు ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, డిసెంబర్ 19 : విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ జట్టుకు ఎంపికవ్వాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంప్‌లో గల ఇండోర్ స్టేడియంలో డీఎస్‌ఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 67వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-14 బాల బాలికల బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక పోటీలను మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఎమ్మెల్యే ప్రారంభించారు. క్రీడాకారులు మెరుగైన ప్రదర్శన చూపడం ద్వారా తమ జట్టును గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీనాయక్, బ్యాడ్మింట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వాసుదేవరావు, డాక్టర్లు ప్రశాంత్, అంజయ్య, కౌన్సిలర్లు గంధం రామకృష్ణ, జానిపాషా, ఉదయ్‌భాస్కర్, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి, నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, బ్యాడ్మింటన్ జిల్లా కోచ్ రామకృష్ణ, పీడీలు వెంకటేశ్వర్లు యాదవ్, సైదులు, వెంకటరత్నం పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ : ఈ నెల 22న నిర్వహించే సెమీ క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బీఎల్ఆర్ కోరారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ చెన్నయ్య అధ్యక్షతన నియోజకవర్గ పాస్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఏడాదిలాగే ఈ సారి కూడా వేడుకలను ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తాసీల్దార్ హరిబాబు, డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, గాయం ఉపేందర్‌రెడ్డి, అధికారులు, పాస్టర్లు పాల్గొన్నారు.

30న మెగా లోక్ అదాలత్

త్రిపురారం, డిసెంబర్ 19 : ఈ నెల 30న నిడమనూరు కోర్టులో నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ కె.వీరశేఖర్ కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మాస్క్ ధరించని, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, పిటీ కేసులు పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కక్షిదారులు రాజీమార్గంతో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నల్లగొండ సిటీ, డిసెంబరు 19 : నల్లగొండ పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గొల్లగూడ, పెద్దబండ, అవుట్‌డోర్ స్టేడియం, తదితర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

దర్వేశిపురంలో వస్తువుల విక్రయానికి వేలం

నల్లగొండ సిటీ, డిసెంబరు 19 : కనగల్ మండలం దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ఏడాది కాలానికి గాను వివిధ వస్తువుల విక్రయ హక్కులు కల్పించేందుకు అధికారులు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. కొబ్బరికాయల విక్రయ హక్కును పాలకుర్తికి చెందిన వంగూరి సోమయ్య రూ. 82.50 లక్షలకు దక్కించుకోగా పూలు, పండ్లు విక్రయ హక్కును పాలకుర్తికి చెందిన విజయకుమార్ రూ.10.50 లక్షలకు వేలం పాగా దక్కించుకున్నారు. ఒడి బియ్యం చీరెలకు టెండర్లు రానందున వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఈఓ జయరామయ్య, ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి, చైర్మన్ అల్లుబెల్లి నర్సింహరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ జె.చంద్రయ్య, సర్పంచ్ అంజమ్మారామచంద్రం, మాజీ చైర్మన్లు కరుణాకర్‌రెడ్డి, ముత్తయ్య,యాదగిరి, పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఉత్తమ డ్రైవర్‌గా ఎంపికైన అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న టూటౌన్ సీఐ నరసింహారావు చిత్రంలో ఆర్టీసీ డిపో మేనేజర్ పాల్

- **సీఐ నరసింహారావు**

మిర్యాలగూడ టౌన్, డిసెంబర్ 19 : ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని టూటౌన్ సీఐ నరసింహారావు సూచించారు. మిర్యాలగూడ డిపోకు చెందిన ఎం. అశోక్‌కుమార్ 28 సంవత్సరాలుగా ఒక్క ప్రమాదం లేకుండా బస్సు నడిపిస్తుండడంతో అతడిని ఉత్తమ డ్రైవర్‌గా ఎంపిక చేసి మంగళవారం డిపోలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రోడ్లపై ట్రాఫిక్ అధికంగా ఉంటున్న తరుణంలో ఆర్టీసీ డ్రైవర్లు మరింత అప్రమత్తంగా బస్సులు నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ పాల్, ఎస్ఐ రాంబాబు, ఎంఎఫ్ యాదగిరి, లీడింగ్ హ్యాండ్ శ్రీనివాస్, సేఫ్టీ వార్డెన్ టీఎస్ రెడ్డి కార్మికులు పాల్గొన్నారు.

గిడ్డంగులను సద్వినియోగం చేసుకోవాలి

- **నాబార్డ్ ప్రోగ్రాం అధికారి శ్యామ్‌కుమార్**

మాట్లాడుతున్న నాబార్డ్ ప్రోగ్రాం అధికారి శ్యామ్‌కుమార్

త్రిపురారం, డిసెంబర్ 19: వ్యవసాయ గిడ్డంగులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ ప్రోగ్రాం అధికారి శ్యామ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర గిడ్డంగుల అభివృద్ధి నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో మంగళవారం రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు మార్కెట్‌లో ధర లేనప్పుడు గిడ్డంగుల్లో నిల్వ ఉంచుకోవాలన్నారు. నిల్వ ఉంచిన పంటలకు రుణాలు కూడా అందిస్తారని పేర్కొన్నారు. మార్కెట్‌లో మద్దతు ధర వచ్చినప్పుడు రైతులు తాము నిల్వ ఉంచిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. నాబార్డ్ ద్వారా రైతులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ జయరాంనాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెద్దదేవులపల్లి పీఏసీఎస్ చైర్మన్ నాగేందర్‌రెడ్డి, సీఈఓలు నర్సయ్య, ఉపేందర్, గోవర్దన్, డీసీఓ ఆర్.కిరణ్‌కుమార్, సీనియర్ మేనేజర్ సురేశ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మురళి, ఎన్‌డీసీ మేనేజర్ స్వచ్ఛభారతి, తరుణ్, డైరెక్టర్లు వెంకట్‌రెడ్డి, గాసిరాం, లక్మా, సైదానాయక్, నాగేందర్ పాల్గొన్నారు.

యూ-డైస్‌లో పూర్తి సమాచారం పొందుపర్చాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ నర్సింహ

మునుగోడు, డిసెంబర్19 : ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన పూర్తి సమాచారం యూ-డైస్ ఫార్మాట్‌లో పొందుపర్చాలని ఎంఈఓ కూకుంట్ల నర్సింహ అన్నారు. మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో యూ-డైస్ పై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలకు పొందుపర్చిన సమాచారం ఆధారంగానే నిధులు కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో మండల నోడల్ ఆఫీసర్ కె.రవీందర్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ.రఫీ, జీహెచ్‌ఎం మల్లేశం, యాదయ్య పాల్గొన్నారు.

న్యుమోనియాపై అవగాహన సదస్సు

తిప్పర్తి, డిసెంబర్ 19 : 5 ఏండ్లలోపు పిల్లలకు న్యుమోనియా సోకుతున్నందున ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని డాక్టర్ ఇక్తియార్, డాక్టర్ ప్రదీప్ బాబులు సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్య ఆరోగ్య సిబ్బందికి ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు.చిన్నపిల్లలకు దగ్గు, జ్వరం, ఆయాసం ఉంటే వారిని వెంటనే వైద్య పరీక్షలు చేయించేలా అవగాహన కల్పించాలన్నారు. న్యూమోనియా బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుందని, వైద్య సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లి చిన్న పిల్లలను గుర్తించాలని వారి ఏమైనా సమస్యలు ఉంటే గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'శాలిగౌరారం ప్రాజెక్టును నింపేందుకు కృషి'

శాలిగౌరారం, డిసెంబర్ 19 : శాలిగౌరారం ప్రాజెక్టులో నీటి సామర్థ్యం తక్కువగా ఉన్నందున ఉన్నతాధికారులను సంప్రదించి ప్రాజెక్టును నింపేందుకు కృషి చేస్తానని నీటిపారుదల శాఖ ఏఈ రాములు తెలిపారు. మండలంలోని రామగిరి సర్పంచ్ బండారు శంకరయ్యతో పాటు రైతులతో కలిసి మంగళవారం వలిగొండ మండలం నెమిలి కత్వ వద్ద శాలిగౌరారం ప్రాజెక్టులోకి వచ్చే నీటిని ఆయన పరిశీలించారు. ఆయకట్టు కింద యాసంగి సాగుకు నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. రైతులు నిమ్మల వీరస్వామి ఉన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు నీలగిరి విద్యార్థి

రామగిరి, డిసెంబర్ 19: జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు నల్లగొండ పట్టణంలోని నీలగిరి డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు చెందిన నడ్డి రామకృష్ణ ఎంపికయ్యారు. ఎంజీయూ నిర్వహించిన ఐసీటీ పోటీల్లో ప్రతిభ చూపి సిల్వర్ మెడల్ సాధించాడు. దాంతో ఆయన ప్రతిభను గుర్తించిన స్పోర్ట్స్ బోర్డు అధికారులు రామకృష్ణను వర్సిటీ జట్టుకు ఎంపిక చేశారు. త్వరలో కేరళలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనను న్నారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన ప్రిన్సిపాల్ మారం నాగేందర్‌రెడ్డి అభినందించారు.

రామకృష్ణను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మారం నాగేందర్‌రెడ్డి

గ్రామాలకు బస్సులను పునరుద్ధరించాలని వినతి

నల్లగొండ ఆర్‌ఎంకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

శాలిగౌరారం, డిసెంబర్ 19 : మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్‌లను పునరుద్ధరించాలని కోరుతూ కాంగ్రెస్ మండల నాయకులు మంగళవారం నల్లగొండలో ఆర్‌ఎంకు వినతి పత్రం అందజేశారు. నకిరేకల్ వయా శాలిగౌరారం మీదుగా రామగిరి, గురజాల, తిరుమలరాయినిగూడెం, తక్కెళ్లపహాడ్, భైరవునిబండ గ్రామాల మీదుగా అమ్మనబోలు, మోత్కూర్ వరకు బస్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ సదుపాయం కల్పిస్తున్న నేపథ్యంలో మహిళలు సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా బస్‌లను పునరుద్ధరించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. అందించిన వారిలో చాడ సురేశ్‌రెడ్డి, దండ అశోక్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, పడాల సైదులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలి

- **మండల వైద్యాధికారి చందులాల్‌నాయక్**

చందంపేట, డిసెంబర్ 19 : ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సదుపాయాలపై గర్భిణులకు అవగాహన కల్పించడం ద్వారా గవర్నమెంట్ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని మండల వైద్యాధికారి చందులాల్‌నాయక్ సూచించారు. మంగళవారం చందంపేట పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఎన్ఎంలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులకు ఆహార, ఆరోగ్య నియమాలు తెలుపాలని సూచించారు. మన పక్క రాష్ట్రాల్లో కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

శ్రీరాముడి అక్షింతల ఊరేగింపు

హాలియా, డిసెంబర్ 19 : అయోధ్య తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరాముడి అక్షింతలను మంగళవారం హాలియాకు తీసుకొచ్చారు. భక్తులు వాటిని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి కొండదండ రామాలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ అయోధ్యలో రామాలయ నిర్మాణానికి సహకరించిన వారికి స్వామి ప్రసాదంగా అక్షింతలను అందించేందుకు తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాయప్రోలు మురళి, వెంకటాచార్యులు, గోవర్ధనరాఘువాచార్యులు, గుర్రం ప్రభాకర్‌రెడ్డి, బొలిగొర్ల శ్రీనివాస్ యాదవ్, చలమల వెంకట్‌రెడ్డి, కాకునూరి నారాయణగౌడ్, శ్రీనివాస్ గుప్తా, మోదాల రవీందర్, చంద్రశేఖర్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు పోచంపల్లికి రాష్ట్రపతి ముర్ము

(మొదటి పేజీ తవాయి)

తయారీ ప్రక్రియ ఉంటుంది. పట్టుగూళ్ల నుంచి పట్టు తీయడం, ఆసు పోయడం, రంగులు అద్దడం, చిటికి తిప్పడం, చీరెలు నేయడం తదితర వాటిని అడిగి తెలుసుకుంటారు. చివరగా బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరుకుంటారు. ఫంక్షన్ హాల్‌లో సుమారు 400మందికే అనుమతిచ్చారు. కేవలం పాస్‌లు ఉన్నవారినే లోపలికి పంపించనున్నారు. వేదికపై రాష్ట్రపతి ముర్ముతోపాటు గవర్నర్ తమిళిసై, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతోపాటు అధికారులు ఉంటారు. రాష్ట్రపతి ఇక్కడే చేనేత కార్మికులతో ముఖాముఖి నిర్వహిస్తారు. పద్మశ్రీ, సంత్‌కబీర్, జాతీయ అవార్డు గ్రహీతలతో మాట్లాడతారు. అంతేకాకుండా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన 16మందిని గుర్తించి వారి జాబితాను ఢిల్లీకి పంపించగా, అందులో ఎంపిక చేసిన ఐదు నుంచి పది మంది రాష్ట్రపతితో ముచ్చటిస్తారు. అనంతరం కార్మికులను ఉద్దేశించి మాట్లాడే అవకాశం ఉంది.

అన్ని ఏర్పాట్లు పూర్తి..

రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గత వారం, పది రోజులుగా అధికారులు దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. సభాస్థలి, మగ్గాల ప్రదర్శన, వీఐవీల రెస్ట్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ఫంక్షన్ హాల్ చుట్టూ షామియానాలతోపాటు బారికేడ్లు ఏర్పాటు చేశారు. వినోబాబావే, రామచంద్రారెడ్డి విగ్రహాలను రంగులతో అలంకరించారు. రాష్ట్రపతి రాక కోసం మూడు ఆర్మీ చాపర్లను వినియోగించనున్నారు. ఇందుకోసం పోలీస్ స్టేషన్ పక్కనే హెలిప్యాడ్ సిద్ధం చేశారు. సోమవారం స్పెషల్ చాపర్ ట్రయల్ రన్ కూడా నిర్వహించింది.

చేనేత స్టాళ్ల ఏర్పాటు

ఫంక్షన్ హాల్ వద్ద తెలంగాణ చేనేత ఔన్నత్యం ప్రతిబింబించేలా థీమ్ పెవిలియన్ ఏర్పాటు చేయనున్నారు. ఫంక్షన్ హాల్‌లో చేనేతకు సంబంధించిన వివిధ స్టాళ్లు ఏర్పాటు చేశారు. పోచంపల్లి ఇక్కత్, పుట్టపాక తెలియా రుమాళ్లు, ముచ్చపేట, నారాయణపేట, గద్వాల చీరెలు, సిద్దిపేట గొల్లబామ చీరెలతో స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడే చేనేత మగ్గం నేసే విధానం, చీరెల తయారీతోపాటు చరఖాను ప్రదర్శించనున్నారు.

పకడ్బందీ బందోబస్తులో పోచంపల్లి..

రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో పోలీసు బలగాలు పోచంపల్లిలో పటిష్ట బందోబస్తు నిర్వహించాయి. అడుగడుగునా పోలీస్ నిఘా ఉంచాయి. రాష్ట్రపతి పర్యటించే ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. హెలిప్యాడ్ వద్ద బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ప్రత్యేక పోలీస్‌బలగాలు వేదిక వద్ద అనువణువు పరిశీలించాయి. మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేశాయి. ఇప్పటికే సీపీ సుధీర్‌బాబు, డీసీపీ రాజేశ్ చంద్ర ఏర్పాట్లను పరిశీలించారు. ఇక ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

పోచంపల్లిలో ఇక్కత్ వస్త్రాలకు మెరుగులు దిద్దుతున్న చేనేత కార్మికులు

సిల్క్ సిటీ మన పోచంపల్లి

(మొదటి పేజీ తవాయి)

మీద నైపుణ్యంగా నేసేవారు. 1970 నుంచి పట్టు చీరెల నేతపై పట్టు సాధించారు. దేశంలో ప్రసిద్ధిచెందిన పదకొండు రకాల చేనేతల్లో పోచంపల్లి ఒకటిగా నిలిచింది. ఇదో ప్రత్యేక శైలి. రెండు దశాబ్దాల కిందటే టై అండ్ డైలో జాగ్రఫికల్ ఇండికేషన్ (జీఐ) గుర్తింపును సాధించింది. మొదటి పేటెంట్‌ను పొందింది. ఫలితంగా చేనేత ఉత్పత్తుల ఎగుమతి పెరిగింది. పోచంపల్లి కార్మికుల ప్రతిభ విశ్వవ్యాప్తం అయ్యింది. ఇక్కడి నేతన్నలు తమ నైపుణ్యంతో పద్మశ్రీ వంటి పురస్కారాలనూ అందుకున్నారు. పోచంపల్లి చేనేతది వందేండ్ల చరిత్ర. అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన పోచంపల్లి వస్త్రాలు, డిజైన్లపట్ల విదేశీ మగువలు సైతం ఆసక్తి కనబరుస్తున్నారు. ఒకప్పుడు ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగుల్లోనే పోచంపల్లి వస్త్రాలు తయారయ్యేవి. ఇప్పుడు ఇంద్ర ధనుస్సులోని అన్ని రంగుల్లోనూ నేస్తున్నారు. వీటిలో ఇక్కత్ పట్టు చీరెలకు మహా గిరాకీ. సంప్రదాయానికి కట్టుబడుతూనే, మారుతున్న అభిరుచులకు.. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నేతన్నలు తమ కళకు సమకాలీన నైపుణ్యాన్ని జోడిస్తున్నారు. సుప్రసిద్ధమైన పోచంపల్లి కళాప్రతిభ పోచంపల్లి పొలిమేరలకే పరిమితం కాలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాలకు విస్తరించింది. చుట్టూ దాదాపు రెండొందల గ్రామాల్లో అయిదు లక్షల మంది ఈ కళనే ఉపాధిగా ఎంచుకొన్నారు. ఇక్కడ తయారైన వస్త్రాలు అమెరికా, స్విట్జర్లాండ్, సింగపూర్, యూకే, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఒక్కో చీరె ధర గరిష్ఠంగా యాభై వేల రూపాయల వరకూ ఉంటుంది.

1910 నుంచి చిటికీ పరిశ్రమ

1910లో ఇక్కడ చిటికీ పరిశ్రమ ఏర్పడింది. 20వ నంబర్ నూలుపై తెలియా రుమాలు మొదట తయారు చేశారు. వ్యాపార నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చే అరబ్బులు వీటిని ఇష్టపడడంతో తర్వాత అరబ్ దేశాలకు ఎగుమతి అయ్యాయి. రానురాను కాటన్ వస్త్రాలు తయారు చేయడం ప్రారంభించారు.

టూరిజం సెంటర్‌ను పట్టించుకోని పర్యాటక శాఖ

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోచంపల్లిలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రెండు ఎకరాల స్థలంలో రూరల్ టూరిజం సెంటర్‌ను నిర్మించారు. అందులో చేనేత వస్త్రాల తయారీని తెలిపే మగ్గాలు, వస్త్రాలను, గ్రామీణ కళాకారుల తమ ప్రతిభ ప్రదర్శించేలా హంపి థియేటర్‌ను ఏర్పాటు చేశారు. చేనేత వస్త్రాలను విక్రయించేకునే అవకాశం కల్పించారు. కానీ అవి ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. పర్యాటకులు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడమే ప్రధాన కారణం. రామోజీ ఫిలిం సిటీకి వచ్చే టూరిజం బస్సులను భూదాన్ పోచంపల్లి మీదుగా యాదగిరిగుట్ట వరకు నడిపించాలని స్థానికులు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

FLAT FOR SALE
★HAYATHNAGAR: Walkable Distance, Vijayawada Highway, Beside Bus Stop, Sup. Luxurious 3 BHK Flats, Ready to move, 2 side 30' Rd. Ph: 9247326642 / 9849801477.
NT-314488

WANTED
★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024, 9640400073.
NT-314374

సేల్ డీడ్ పోయినది
దొంగరి నాగరాజు, తండ్రి: దొంగరి రామలింగయ్య, ఇ.నెం. 7-1460, బంగారిగడ్డ, మిర్యాలగూడ మం, నల్లగొండ జిల్లా నా యొక్క సేల్ డీడ్ డాక్యుమెంట్ No.123/1991 గల డాక్యుమెంట్ బంగారిగడ్డ నుండి మిర్యాలగూడ బస్టాండ్‌కు వెళ్తుండగా పోయినది దొరికినవారు సంప్ర.9652416787.

CHANGE OF NAME
I BURUGU JAGADEESHWAR S/O RAMULU (OLD NAME) R/o H.No.2-128, Gummadavally Village, Kondamallepally Mandal, Nalgonda District. Vide Affidavit Dated: 19/12/2023 Sworn Before Notary/ Advocate BACHU VENKATARAMANA CHANGED MY NAME AND FATHER NAME **BURUGU JAGADHISHWAR S/O SRI RAMULU (NEW NAME)**

కావలెను
కాంట్రాక్ట్ ఆఫీస్ నందు పనిచేయుటకు ఆఫీస్ అసిస్టెంట్ & రిసెప్షనిస్ట్ కావలెను. సంప్రదించగలరు. సెల్ నెం.7730805327.

NLG-

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

NLG-

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777196	చౌటుప్పల్ : 9182777638